

మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన

- బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి
- సెప్టెంబరు 1నుంచి 7వరకు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- హనుమకొండలో రెండో రోజూ సాగిన కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు

7

మామునూరు విమానాశ్రయంలో ఏఏఐ సర్వే విమానాలు (ఫైల్)



భూసేకరణే అడ్డు!



మామునూరు విమానాశ్రయానికి భూమి కోసం ప్రభుత్వం కసరత్తు



- ఇప్పటికే 700 ఎకరాల అప్పగింత.. మరో 300ఎకరాలు అవసరమని గుర్తించిన ఏఏఐ
- ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల రైతులతో అధికారుల చర్చలు
- భూమికి బదులు భూమి లేదా మార్కెట్ రేటు ఇవ్వాలంటున్న అన్నదాతలు
- నష్టపరిహారం చెల్లింపుపై స్పష్టత ఇవ్వని సర్కారు
- ఇప్పటికే మామునూరులో స్కై అండ్ ల్యాండ్ సర్వే పూర్తి
- 150కిలోమీటర్ల నిబంధన సడలింపుపై 'జీఎంఆర్'తో ప్రభుత్వం చర్చలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ విమానశ్రాయానికి భూసేకరణే ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టు కోసం 700ఎకరాల భూమిని అప్పగించగా, మరో 300ఎకరాల భూమిని కేటాయించాలని ఎయిర్‌పోర్టు అథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రభుత్వాన్ని కోరింది. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్న ప్రభుత్వం.. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. అయితే భూమికి బదులు భూమి ఇవ్వాలని లేదంటే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరను చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.1కోటి నుంచి రూ.2కోట్లకు పైగా ధర ఉంది. దీంతో ప్రభుత్వం రైతులకు చెల్లించే నష్టపరిహారం విషయంలో స్పష్టత ఇవ్వకపోవటంతో ఎయిర్‌పోర్టుకు భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారిందనే చర్చ జరుగుతోంది.

ఎయిర్‌పోర్టుకు సర్వేలన్నీ అనుకూలమే..

2017 ఏప్రిల్ 27న ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద వరంగల్ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఓఎల్ఎస్ సర్వే, సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు అథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గత 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతోపాటు మరో సారి గత ఏప్రిల్‌లో ఏఏఐ అధికారులు ఓఎల్ ఎస్ సర్వేతో పాటు మట్టి పరీక్షలు నిర్వహించారు. మూడు విమానాలతో ఎయిర్ వ్యూ చేపట్టారు. విమానాల రాకపోకలకు వాతవారణం అనుకూలంగా ఉందా లేదా అని పరి శీలించారు. జియాజికల్ సర్వేతో పాటు స్కై అండ్ ల్యాండ్ సర్వే చేపట్టారు. సుమా రు రెండు వా రాల పాటు ఏఏఐ సిబ్బంది మామునూనులోనే మకాం వేసి ఎయిర్ పోర్టు నిర్వహణకు కావాల్సిన అన్ని టెస్టులను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు. ఇక హైదరా బాద్ వి మా నా శ్ర య ా న్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పదం మేరకు 150కి.మీ పరిధిలో 2038 వరకు మరో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు మామునూరు 145కిలో మీటర్ల లోపే ఉంది. ఈ నిబంధనల సడలింపుపై ప్రభుత్వం అభ్యర్థన మేరకు జీఎంఆర్ నుంచి సానుకూలత వచ్చిందని సమాచారం.



అంతర్జాతీయ స్థాయి విమానాలకు అనుకూలంగా...

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది వరంగల్ ఎయిన్ పోర్టు పరిస్థితి. అన్ని రకాల అనుమతులు, అనుకూలతలు ఉన్నప్పటికి ఎయిర్‌పోర్టు ఏర్పాటకు ఏదో ఒక అడ్డంకి ఎదురవుతోంది. గత ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ప్రయత్నాలు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన మరో 438 ఎకరాల భూమితో పాటు రూ.1,200కోట్ల నిధులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఏఐ

మిగతా 7వ పేజీలో..

రైతులతో చర్చిస్తున్నాం..

రేవూరి ప్రకాష్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే



మామునూరు ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని ఇచ్చేందుకు రైతులతో చర్చలు జరుపుతున్నాం. ఇప్పటికే సంగెం మండలంలోని పలు గ్రామాల్లో సభలు నిర్వహించాం. భూమికి బదులు భూమి కావాలని రైతులు కోరుతున్నారు. లేదంటే బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని అడుగుతున్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వరంగల్ వాసులకు గగనయానం సాకారం అవుతుందనే నమ్మకం ఉంది.



వనదేవతల సన్నిధిలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్

మేడారం వనదేవతలను దర్శించుకున్న ట్రైకార్ చైర్మన్

మేడారం, ఆగస్టు 23: తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ శుక్రవారం దర్శించుకున్నారు. ట్రైకార్ జనరల్ మేనేజర్ శంకర్‌రావుతో కలిసి మేడారాన్ని సందర్శించారు. వారిని దేవాదాయ శాఖ అధికారులు, పూజారుల ఘనస్వాగతం పలికారు. తల్లుల గద్దెలకు చేరుకున్న బెల్లయ్య నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గద్దెల ప్రాంగణంలో ట్రైకార్ చైర్మన్, జనరల్ మేనేజర్‌కు పూజారులు తల్లుల కండువాతో సన్మానించి ప్రసాదాలను అందజేశారు. గిరిజన సంక్షేమం డీడీ పోచం, జీసీసీడీఎం ప్రతాప్‌రెడ్డి, ఏటీడీవో దేశీరాం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ములుగు కలెక్టర్ దివాకర

ములుగు, ఆగస్టు 23: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈనెల 27, 28 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టి.ఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశపుహాల్‌లో ఆయన ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, ఏఎస్పీ శివ ఉపాధ్యాయలతో కలిసి గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఈనెల 27న కలెక్టరేట్ సమావేశపుమందిరంలో గవర్నర్ జిల్లాకు చెందిన ప్రముఖ రచయితలు, కళాకారులు, వివిధ జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలతో చర్చిస్తారని అన్నారు. అనంతరం జిల్లాలోని రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయం, లక్నవరం సరస్సును సందర్శించి రాత్రి బస చేస్తారని, మరుసటి రోజు హనుమకొండకు చేరుకుంటారని తెలిపారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని అన్నారు. ముఖ్యంగా పోలీస్‌శాఖ పటిష్ఠ బందోబస్తు చేయాలని సూచించారు. ఈసమావేశంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవో సంపత్‌రావు, డీఎస్పీ రవీందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న ఆర్డీవో మంగీలాల్

రైతు ఆత్మహత్యలపై విచారణ

కాటారం, ఆగస్టు 23: మండలంలోని కొత్తపల్లి, సుందర్రాజ్‌పేట, దస్తగిరిపల్లి, కాటారం, ఇబ్రహీంపల్లి, ఆదివారంపేట, పరికిపల్లి గ్రామాల్లో కొన్నేళ్లుగా జరిగిన రైతు ఆత్మహత్య ఘటనలపై భూపాలపల్లి ఆర్డీవో మంగీలాల్ శుక్రవారం విచారణ చేపట్టారు. రాష్ట్రంలో చోటుచేసుకున్న రైతు ఆత్మహత్యలపై గతంలో హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం(పిల్) దాఖలైంది. దీంతో పునర్విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రైతు ఆత్మహత్యల మండల స్థాయి కమిటీ సభ్యులైన తహసీల్దార్ నాగరాజు, ఎస్సై అభినవ్, ఆర్ఐ వెంకన్నతో కలిసి ఆర్డీవో పునర్విచారణ చేపట్టారు. 2014 నుంచి 2019 వరకు ఆత్మహత్యలు చేసుకున్న రైతులు ఆదివారంపేటకు చెందిన చిలుముల సమ్మయ్య, గారెపల్లికి చెందిన గుండ్లపల్లి సత్యం, దస్తగిరిపల్లికి చెందిన నరిగె రాజమౌళి, ఇబ్రహీంపల్లి కి చెందిన సిద్దం మొగిలి, కొత్తపల్లికి చెందిన అజ్మీరా నరేష్, సుందర్రాజ్‌పేటకు చెందిన పంగ అంకూస్, పరికిపల్లికి చెందిన జిముడ శారద ఇళ్లకు వెళ్లిన అధికారులు విచారణ చేశారు. ఆత్మహత్యల పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోర్ క్లీనర్ తాగి ఒకరి మృతి

ములుగు, ఆగస్టు 23: మద్యం మత్తులో ఫ్లోర్(గచ్చు) క్లీనర్ లిక్విడ్ తాగి వ్యక్తి మరణించిన ఘటన ములుగు మండలం జంగాలపల్లిలో చోటుచేసుకుంది. జంగాలపల్లికి చెందిన అరుణ, పల్లకి శ్రీనివాస్(37) 2014లో ప్రేమ వివాహం చేసుకున్నారు. గ్రామంలోనే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. మద్యానికి బానిసగా మారిన శ్రీనివాస్ గురువారం రాత్రి మత్తులో లిక్విడ్‌ను తాగాడు. ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీనివాస్ (ఫైల్)

భూపాలపల్లి బంద్ ప్రశాంతం



బంద్ సందర్భంగా మూసి ఉన్న దుకాణాలు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 23: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడిని నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం భూపాలపల్లి పట్టణ బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా దుకాణాలను, విద్యాసంస్థలను బంద్ చేయించారు. బంద్‌కు సహకరించిన వ్యాపార, వాణిజ్య సంస్థల యాజమాన్యాలకు కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

అదుపు తప్పిన జీపు

- పలువురికి స్వల్ప గాయాలు

కన్నాయిగూడెం, ఆగస్టు 23: జీపు అదుపు తప్పి పలువురు స్వల్పంగా గాయపడిన సంఘటన మండలంలోని కంతనపల్లి మలుపు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌కు చెందిన ఆరుగురు కన్నాయిగూడేనికి ఓ వివాహ శుభకార్యానికి బయల్దేరి వస్తున్న క్రమంలో కంతనపల్లి లోని సింగిల్ రోడ్డు మలుపు వద్ద జీపు అదుపు తప్పి చెట్లల్లోకి దూసుకు వెళ్లింది. దీంతో పలువురు స్వల్పంగా గాయపడ్డారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



సాంబయ్య మృతదేహం

టేకుమట్ల, ఆగస్టు 23: చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన మండలంలోని భూర్నపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాద్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వెంకట్రావుపల్లి (బీ) గ్రామానికి చెందిన కుక్కల సాంబయ్య (58) పక్క గ్రామమైన భూర్నపల్లి శివారులోని చలి వాగును ఆనుకొని ఉన్న మడుగులో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి మడుగులో పడిపోయి నీటమునిగి మృతి చెందాడు అటుగా వెళ్లిన వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కాసాని సంతోష్ గమనించి స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామస్థులు కోరుకుంటున్నారు.

రైతుల ఇబ్బందులు తొలగించేందుకే ఆర్‌వోఆర్ యాక్ట్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 23: రైతుల ఇబ్బందులను తొలగించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌వోఆర్ యాక్ట్-2024ను రూపొందిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. నూతన ఆర్‌వోఆర్ యాక్ట్‌పై కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన చర్చా వేదికలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలకు, రైతులకు ప్రయోజనకారిగా ఉండే విధంగా చట్టం తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో 70 సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న భూములకు కూడా ఇప్పటికీ పట్టాలులేవన్నారు. గత ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు ఏర్పాటుచేయడంతో నిరుపేదలు తమ జీవనాధారం కోల్పోయరన్నారు. జిల్లాలో భూమి మోకా మీద ఒకరు ఉంటే రికార్డుల్లో ఒకరు ఉంటున్నారన్నారు. రామప్పచెరువు ఆయకట్టులో 5వేల ఎకరాల విస్తీర్ణానికి హక్కులు లేకుండా పోయయన్నారు. అసైన్డ్ భూములు అందజేసి దున్నుకునే హక్కు కల్పిస్తే గత ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొట్టిందని విమర్శించారు. గత పదేళ్లకాలంలో తహసీల్దార్లు, వీఆర్వోలు పరిష్కరించకుండా రెవెన్యూ వ్యవస్థను నీర్వీర్యం చేశారన్నారు. కింది స్థాయి సిబ్బంది తప్పుచేస్తే తహసీల్దార్, తహసీల్దార్ తప్పు చేస్తే ఆర్డీవో, ఆర్డీవో తప్పు చేస్తే కలెక్టర్ చర్యలు తీసుకునేలా చట్టం రాబోతోందన్నారు. రాష్ట్రంలో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉందని త్వరలోనే వారిని నియమిస్తామన్నారు. వీఆర్‌వోల నియామకాలు కూడా చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, డీపీవో విజయ్‌భాస్కర్, అన్ని మండలాల తహసీల్దార్లు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

ములుగు, ఆగస్టు 23: కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులో ఆయన శక్రవారం పర్యటించారు. పాలకుల విధానాల వల్ల బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, అన్నిరంగాల్లో అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించాల్సి అవసరం ఉందన్నారు. దేశ జనగణనలో బీసీ కులగణన జరపాలని, బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, రూ.2లక్షలకోట్లతో బీసీల సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం కామా రెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని అన్నారు. కులాల జనాభా లెక్కలు తేల్చి బీసీలకు 42శాతం రిజర్వేషన్ పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, ముత్యాల రాజు, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు ఎమ్డీ.అ మ్జద్‌పాషా, బండి నర్సయ్య, నరేందర్, మహేందర్, సారయ్య, రాజన్న, శరబందం, ఇంజం కొమురయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

సీపీఎస్ కొనసాగింపుపై ఉపాధ్యాయుల నిరసన

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 23: కాంట్రీబ్యూషన్ పెన్షన్ స్కీం (సీపీఎస్) కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఉపాధ్యాయులు భగ్గుమన్నారు. టీఎస్‌ఈపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో భూపాలపల్లిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెండెం మధుసూదన్, దిల్షాద్ మాట్లాడుతూ 30 ఏళ్లపాటు ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ లేకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకొని పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకృష్ణ, సలీం, హుస్సేన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

టేకు కలప పట్టివేత

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 23: ఎడ్ల బండ్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అటవీ శాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఉత్తర విభాగం ఫారెస్ట్ రేంజ్ అధికారి అబ్దుల్ రహమాన్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బూటారం గ్రామం నుంచి మండల కేంద్రంలోని ఓడవాడకు ఐదు ఎడ్ల బండ్ల ద్వారా టేకు కలపను తరలిస్తుండగా ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. కలపతో పాటు ఎండ్లబండ్లను అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. పట్టుపడిన కలప విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని రేంజ్ అధికారి తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశామన్నారు.

కాటారంలో...

కాటారం : మండలంలోని 353(సీ)జాతీయ రహదారిపై మేడిపల్లి అటవీప్రాంతంలో అక్రమంగా టేకు కలపను రవాణా చేస్తున్న వాహనాన్ని ఫారెస్టు అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. కాటారం రేంజ్ అధికారి మహ్మద్ ఆసిఫ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ వైపు నుంచి భూపాలపల్లికి టేకు కలపను వాహనంలో రవాణా చేస్తున్నట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. దీంతో రేంజర్ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది కాటారం మండల కేంద్రం శివారులో మాటు వేశారు. వాహనం రాగానే ఆపడానికి య త్నించగా డ్రైవర్ ఆపకుండా ముందుకు దూసుకెళ్లాడు. అటవీశాఖ అధికారులు తమ వాహనాల్లో ఛేజ్ చేస్తుండగా కలప వాహనం ముందు రెండు లారీలు వెళ్తుండటంతో మేడిపల్లి శివారులో డ్రైవర్ దాన్ని వదిలేసి పారిపోయాడు. అందులో ఎనిమిది టేకు దుంగలుండగా వాటి విలువ సుమారు రూ.లక్ష ఉందని అటవీశాఖ అధికారులు తెలిపారు. టేకు కలప సహా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కలపను స్వాధీనం చేసుకున్న వారిలో డిప్యూటీ రేంజర్ సురేందర్‌నాయక్, ఎఫ్ఎస్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవోలు అశోక్, రాజ్‌కుమార్, సిబ్బంది మహ్మద్ బేగ్, రాజు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

జడ్పీ సీఈవో విద్యాలత



డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యాలత

హసన్‌పర్తి, ఆగస్టు 23: మహాత్మా జ్యోతిబా పూలే బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను అందించాలని జెడ్పీ సీఈవో విద్యాలత అన్నారు. మండలంలోని ఎల్లాపూర్‌లో గల తిమ్మాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల విద్యాలయాన్ని శుక్రవారం విద్యాలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిస్థితిని, ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టాక్ రూం, రన్నింగ్, ఆర్‌వో వాటర్, టాయిలెట్స్‌తో పాటు ఇతర వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యలు వచ్చినప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులను సమన్వయం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు మెరుగైన వసతులను సమకూర్చేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులున్నారు.



ప్రేమపెళ్లి చేసుకుని ముఖం చాటేశాడు

భర్త, ఆరుగురిపై కేసు నమోదు

భీమదేవరపల్లి, ఆగస్టు 23: మండలంలోని ముల్కనూర్‌లో ప్రేమ వివాహం చేసుకొని ముఖం చాటేసిన భర్తతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ముల్కనూర్ ఎస్‌ఐ సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రికి చెందిన ఉడిపి చంద్రకళను మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన బొల్లంపల్లి రంజిత్ 2018లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. చంద్రకళతో రంజిత్ సుమారు ఏడేళ్ల సహజీవనం చేశాడు. గత నెల జూలై 29న తన ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన రంజిత్.. భార్య చంద్రకళ వద్దకు రావడం లేదు. దీంతో అనుమానం వచ్చిన చంద్రకళ ముల్కనూర్‌లోని అత్తాగారి ఇంటికి వచ్చి తన భర్త రంజిత్ కోసం వాకప్ చేసింది. రూ. 50 లక్షల కట్నం ఇవ్వాలని చంద్రకళను భర్త రంజిత్, అత్తామామలు రామచంద్రం- కనకలక్ష్మి, ఆడబిడ్డలు రమాదేవి, ధనలక్ష్మిలు బెదిరిస్తున్నారు. దీంతో చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేయగా, భర్త రంజిత్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు రామచంద్రం, కనకలక్ష్మి, బొల్లంపలి రాజు, రమాదేవి, ధనలక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు ముల్కనూర్ పోలీసులు తెలిపారు. రంజిత్ పరారీలో ఉన్నాడు.

రికార్డుల్లో ఎక్కువ..

హాస్టల్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్య తక్కువ

అధికారుల తనిఖీలో గుట్టు రట్టు

ఆత్మకూరు, ఆగస్టు 23: హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా.. రికార్డులో మాత్రం విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపిస్తున్న విషయం అధికారుల తనిఖీల్లో బయటపడింది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ఎస్సీ బీసీ రెండు హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో 43 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో పేర్లు ఉన్నాయి కానీ రెండు హాస్టల్‌లో కేవల 17 మంది విద్యార్థులు ఉన్నారని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, నాయిని జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య ఆదేశానుసారం రెండు హాస్టల్‌లను ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఆర్‌ఐ రవీందర్‌రావు ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా లేని విషయాలను గుర్తించారు. ఈ విషయాలను జిల్లా కలెక్టర్ కు నివేదికను సమర్పిస్తామన్నారు. సరైన వసతి లేకపోవడంతో విద్యార్థులు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లిపోతున్నట్లు విద్యార్థులు తెలిపారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు















'అడ్డగోలు రిజిస్ట్రేషన్ల'పై విజిలెన్స్ ఆరా

- రంగంలోకి అధికారులు.. వెలుగులోకి మరిన్ని అక్రమాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రకంపనలు



రాంనగర్, ఆగస్టు 23 : వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'నిబంధనలు మరిచి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు' చేశారన్న అంశంపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనం రిజిస్ట్రేషన్ శాఖలో తీవ్ర ప్రకంపనలు రేపింది. ఈ రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు జిల్లాలోని మిగిలిన కార్యాలయాల్లో పరిస్థితంతా గప్‌చుప్‌గా మారినట్టు తెలిసింది. ఇటీవల బదిలీపై వచ్చిన ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహించినట్టు సమాచారం. ఎవరితో మాట్లాడితే ఏమవుతుందో అనే అనుమానంతో మౌనంగానే విధులు నిర్వహించి వెళ్లినట్టు తెలిసింది. కాగా బదిలీపై వెళ్లిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు నిబంధనలు విస్మరించి నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి అందినకాడికి దండుకున్నారనే విషయమై విజిలెన్స్ అధికారులు ఆరా తీసినట్టు సమాచారం. రెండు కార్యాలయాల్లో గత ఆరు నెలల్లో జరిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలు సేకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సోమవారం రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

వెలుగులోకి మరిన్ని అక్రమాలు

కాగా వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు పరకాల, మహబూబాబాద్, ములుగు కార్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిసింది. నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లతో పాటు పహాణీలతో రిజిస్ట్రేషన్లు చేసినట్టు తెలిసింది. పూర్వీకులు అమ్ముకున్న స్థలాలను కుటుంబ సభ్యులు విక్రయించడం లాంటి రిజిస్ట్రేషన్లు చేశారని, వరంగల్ రూరల్ కార్యాలయంలో కొద్దిరోజులు ఇన్‌చార్జ్‌గా బాధ్యతల్లో ఉన్న ఒక అధికారి వరంగల్ ప్రాంతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని సమాచారం. ఈ అధికారి నిబంధనలు తుంగలో తొక్కి పహాణీలతో రిజిస్ట్రేషన్లు చేశాడనే ఆరోపణలున్నాయి. పరకాలలో కూడా నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు, పార్ట్ రిజిస్ట్రేషన్లు భారీగానే జరిగినట్లు తెలిసింది. ఈ దందాలో పెద్ద మొత్తంలో కాసులు చేతులు మారినట్టు తెలుస్తుండగా ఇటీవల ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ హాయంలో జరిగిన రిజిస్ట్రేషన్లు పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశమున్నట్టు చర్చ జరుగుతోంది. ఇక మహబూబాబాద్, ములుగు కార్యాలయాల పరిధిలో నాన్ లేఅవుట్ వెంచర్లకు సంబంధించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పెద్ద ఎత్తున జరిగినట్లు తెలుస్తుండగా గతేడాది కాలంగా ఈ దందా విచ్చలవిడిగా జరిగినట్టు సమాచారం. అధికారులు వరంగల్ రూరల్, ఖిలా వరంగల్, పరకాల, మహబూబాబాద్, ములుగు కార్యాలయాల్లోని రికార్డులు పరిశీలిస్తే మరిన్ని అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 23: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి ఆ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మార్కెట్లో క్రయవిక్రయాలు యథావిధిగా నిర్వహించబడుతాయని, రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

మెట్టుగుట్ట ఆలయ అర్చకుడిపై ఫిర్యాదులు

విచారణ చేపట్టిన డిప్యూటీ కమిషనర్?

వరంగల్ కల్చరల్, ఆగస్టు 23 : మడికొండ మెట్టుగుట్టలోని మెట్టు రామలింగేశ్వర దేవాలయం ఆలయ అర్చకుడిని శుక్రవారం జిల్లా సహాయ కమిషనర్ రాయల సునీతతో కలిసి ఆలయానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు సమాచారం. డబ్బులు వసూలు చేయడమేకాక, డబ్బున్న వారికే ప్రాధాన్యమిస్తున్నారంటూ భక్తులు దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావుకు అర్చకుడు అభిలాష్‌శర్మపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఆలయానికి చేరుకొని దేవాదాయ శాఖ ఆలయ క్లర్క్ భాస్కర్‌పై కూడా ఆరోపణలు ఉన్న నేపథ్యంలో డీసీ భక్తులను అర్చకుడిని, క్లర్క్‌ను విచారించినట్లు తెలిసింది.



మన్‌షాన్‌పల్లి పాఠశాలను శుభ్రం చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ పర్శరాములు

కొలువులకు.. భద్రతేది?

- ఆర్థిక ఇబ్బందులతో పార్ట్‌టైం స్వీపర్లు
- పర్మినెంట్ చేస్తారని 30ఏళ్లుగా ఎదురుచూపు
- హైపవర్ కమిటీ వేసినా ఫలితం శూన్యం
- ఏపీలో పాతికేళ్ల క్రితమే క్రమబద్ధీకరణ
- తెలంగాణలో ఇప్పటివరకు అతీగతీ లేదు

బచ్చన్నపేట, ఆగస్టు 23: మంచి రోజులు రాకపోతాయా.. దశ మారకపోతుందా.. అని పార్ట్ టైమ్ స్వీపర్లు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందుతామని, కనీస వేతనం అందుతుందని 30 ఏళ్లకు పైగా చాకిరీ చేస్తున్నారు. చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతూ బతుకుబండిని నెట్టుకొస్తున్నారు. రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో దశాబ్ధాలుగా పని చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ల దుస్థితి ఇది. వీరిలో ఇప్పటికే అనేక మంది మృతి చెందగా, కొందరు రిటైర్ అయ్యారు. 1983లో పార్ట్‌టైం స్వీపర్లుగా ఆంధ్ర, తెలంగాణాలో ఒకేసారి నియామకం అయినప్పటికీ 1994లో అక్కడి వారిని పర్మినెంట్ చేశారు. కాని తెలంగాణలో ఇప్పటి వరకు మోక్షం కలగలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని ఆశించినప్పటికీ వారికి నిరాశే ఎదురైంది. మొదట్లో వీరికి నెలకు రూ. 150 జీతం వచ్చేది. అతి తక్కువ జీతమైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో కొలువు అన్న భావనతో పని చేస్తున్నారు. పర్మినెంట్ అయితే జీతం పెరుగుతుందని ఆశతో జీవిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది ప్రస్తుతం పనిచేస్తున్నారని సంఘం నేతలు చెబుతున్నారు. వారిలో జనగామ జిల్లా నుంచి 35 మంది ఉన్నారు.

హైపవర్ కమిటీ వేసినా ఉపయోగం లేదు..

వేతనాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని పార్ట్‌టైం స్వీపర్లు చేసిన ఆందోళనలతో 1992లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వారిని పర్మినెంట్ చేసేందుకు హైపవర్ కమిటీ వేశారు. ఏవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీ స్వీపర్ల క్రమబద్ధీకరణకు అనుకూలంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. వీరి వేతనాన్ని స్థిరీకరించి టైమ్ స్కేల్ ఇవ్వాలని ఆదేశించింది. కాని, ఈ ఉత్తర్వులు అమలు కాకపోవటంతో హైకోర్టుకు వెళ్లారు. దీంతో ఈ విషయంలో ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవోఎంఎస్ నెం.212 ద్వారా 1994 ఏప్రిల్ 22న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్వీపర్లు ఇక తమ కష్టాలు గట్టెక్కినట్టేనని సంబరాలు చేసుకున్నారు. కాని ఆంధ్ర ప్రాంతంలో పని చేసిన అధికారులు అక్కడ పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లను పర్మినెంట్ చేశారు. వారు ప్రస్తుతం రూ.20 వేల జీతం పొందుతున్నారు. కానీ తెలంగాణలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. తర్వాత తమ సమస్యలు పరిష్కరించాలని 2007లో చలో సీఎం కార్యక్రమం నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. అయినా స్పందన లేకపోవడంతో మానవ హక్కుల సంఘాన్ని సైతం ఆశ్రయించారు. దీంతో వారికి అనుకూలంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, ఆర్థిక శాఖల అధికారులను సంఘం ఆదేశించింది. వీరి వివరాలు తెప్పించుకున్న అధికారులు అంతటితోనే చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం నెలకు రూ. 5200 ల వేతనంతో జీవితం గడుపుతున్నారు. పార్ట్ టైం స్వీపర్లు పనిచేస్తున్న పాఠశాలల హెచ్‌ఎంలు అటెండెన్స్ పత్రాలను ఎంపీడీవోకు ప్రతీనెల పంపిస్తే వారు బిల్లులు చేసి ఎస్‌టీవోకు పంపుతారు. మూడు మాసాలు, ఆరు మాసాలకోమారు జిల్లా పరిషత్ నుంచి వచ్చే కాంటిన్‌జెన్సీ నిధులు జమచేస్తే వీరికి జీతాలు ఖాతాల్లో పడుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకుని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని స్వీపర్లు కోరుతున్నారు.

ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలి

- గూడముల అయోధ్య, పార్ట్‌టైం స్వీపర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



తెలంగాణ రాష్ట్రం వచ్చాక మా బతుకులు మారుతాయనుకున్నాం. కాని, మమ్మల్ని పర్మినెంట్ చేయటంలో కేసీఆర్ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. 1983 నుంచి అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రస్తుతం పని చేస్తున్నావారిని పర్మినెంట్ చేయడంతో పాటు మృతి చెందిన వారి కుటుంబాలకు, రిటైర్ అయిన వారి కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలి.

కట్కూరు బడిలో 35 ఏళ్లు పనిచేశా..

- బాలమల్లయ్య, రిటైర్డ్ పార్ట్‌టైం స్వీపర్, కట్కూరు



కట్కూరు ప్రైమరీ పాఠశాలలో 35 ఏళ్లు పనిచేశా. ప్రారంభంలో రూ. 150 జీతం ఇచ్చేవారు. రిటైర్‌మెంట్ సమయానికి రూ. 4 వేలు చేశారు. ఉద్యోగంలో చేరే సమయంలో కొద్ది రోజుల్లోనే పర్మినెంట్ చేస్తామన్నారు. ఇప్పటి వరకు అమలు చేయలేదు. అనేక సార్లు ఆందోళనలు చేశాం. కోర్టుకు వెళ్లాం. అయినా మా బతుకులు మారలేదు. మంచి రోజులు రాకపోతాయా అని ఎదురు చూస్తూ మా జీవితాలను బజారున పడేసుకున్నాం. ప్రస్తుతం పనిచేస్తున్న వారికైనా ప్రభుత్వం న్యాయం చేయాలి.

సీఆర్‌పీఎఫ్ వాహనం నుంచి

కిందపడ్డ కార్బన్ వెపన్

- ఆయుధాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేసిన ఆటోడ్రైవర్
- సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి గన్‌ను అప్పగించిన పోలీసులు

మట్టెవాడ, ఆగస్టు 23: వరంగల్ ఎంజీఎం జంక్షన్ సమీపంలో సీఆర్‌పీఎఫ్ ట్రక్ వాహనం నుంచి కార్బన్ వెపన్ ఎంజీఎం జంక్షన్ సమీపంలో కిందపడిపోయింది. అదే సమయంలో అటు వైపు నుంచి వస్తున్న ఆటో డ్రైవర్ గమనించి ఆ ఆయుధాన్ని మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో అప్పగించిన ఘటన వరంగల్‌లో చోటు చేసుకుంది. వరంగల్ మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో భీమారంలోని సీఆర్‌పీఎఫ్ బెటాయిన్ మణిపూర్‌కు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాల్లో సిబ్బందితోపాటు ఆయుధాలను వరంగల్ రైల్వేస్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వాహనం నుంచి సీలింగ్ ఊడిపోయి కార్బన్ వెపన్ కింద పడిపోయింది. అదే సమయంలో పైడిపల్లికి చెందిన ధరావత్ శ్రీను ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా, ఓ షోరూం ఎదురుగా ఉన్న రోడ్డుపై ఆయుధం ఉండడానిన గుర్తించాడు. వెంటనే అతడు మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ ధర్మనాయక్‌కు అప్పగించారు.

కొంత సమయం తర్వాత సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వెపన్ వెతుకుతున్న క్రమంలో స్టేషన్‌లో అప్పగించినట్లు తెలుసుకున్నారు. దీంతో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ రాజేష్‌కుమార్ పోలీసు స్టేషన్‌కు చేరుకొని విషయం వెల్లడించగా వారు ఆయుధాన్ని అప్పగించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీరకం)	2711	2572
పల్లికాయ(పచ్చిది)	3900	3200
పల్లికాయ(సూక)	5900	5000
పెసర	5855	5155
పత్తి	7410	5000
పసుపు(కాడి)	12223	12223
పసుపు(గోల)	12226	12226
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	18000	15000
వండర్‌హాట్ ఏసీ	14800	11000
యూఎస్341 ఏసీ	14500	11000
తాలు మిర్చి	6000	3000

రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన

- బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు నారాయణ
- హనుమకొండలో రెండో రోజు సాగిన కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు



వయనాడ్ బాధితుల కోసం డి.రాజాకు చెక్కు అందిస్తున్న నాయకులు

బాలసముద్రం, ఆగస్టు 23 : నరేంద్రమోదీ ఎన్నికల్లో గెలిచినా నైతికంగా ఓడిపోయారని, ఆయన పాలన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సాగుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. 'దేశంలోని మహిళలకు న్యాయం చేస్తాం.. సబ్ కే సాత్.. సబ్ వికాస్' అని ప్రకటించిన మోదీ ప్రభుత్వం తమ నినాదాన్ని మార్చుకుని తమతో ఎవరుంటే.. వారితో తాముంటాం అనే కొత్త నినాదాన్ని అమలు చేస్తోందని ఆరోపించారు. దేశంలో మహిళలకు రక్షణ లేదని, వివిధ రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో కేంద్రం ద్వారా నామినేట్ చేయబడిన గవర్నర్లతో రాజ్యాంగ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగుతోందని, ఏపీ సీఎం చంద్రబాబు, నితీష్‌కుమార్ మద్దతు ఇవ్వకుంటే కేంద్ర ప్రభుత్వం పడిపోతుందన్నారు. దేశంలో సీబీఐ సంస్థ అత్యంత పవర్‌ఫుల్ సంస్థ అని ఆ సంస్థ అదానీ చేతిలోకి వెళ్లిందని విమర్శించారు. దేశంలోని బీజేపీ వ్యతిరేక పార్టీలు అధికారంలో ఉన్న తమిళనాడు, కేరళ, ఢిల్లీ, కర్నాటక సీఎంలను సీబీఐ సంస్థలతో ఇబ్బందులకు గురి చేసిందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మధ్య దూరం పెరిగిందని, ప్రధాని మోదీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు జాతీయ స్థాయిలో ఉన్న ఇమేజ్‌ను వాడుకుని దేశంలో రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన చేస్తున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, అమరావతికి రూ.వేల కోట్ల నిధులు ప్రపంచ బ్యాంకుల నుంచి అప్పులు ఇప్పించి మోదీ చంద్రబాబును పావుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పును సీపీఐ స్వాగతిస్తున్నట్లు నారాయణ తెలిపారు. వర్గీకరణకు క్రీమీలేయర్‌కు సంబంధంలేదని, రాష్ట్రంలో ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీలో బీఆర్ఎస్ విలీన మవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతుండగా, రేవంత్ బీజేపీలో చేరుతారని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారన్నారు. రెండు పార్టీ లు రాజకీయ క్రీడ ఆడుతున్నారని, ప్రజలకు కావాల్సింది, అభివృద్ధి, సంక్షేమం అని నారాయణ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన సరిగ్గా చేసుకోవాలని హితవు పలికారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపో యాయని ధరల నియంత్రణ డిమాం డ్ చేస్తూ సెప్టెంబరు 1 నుంచి 7వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నామని, ఈ ప్రజా పోరాటాలలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా మాట్లాడుతూ ప్రజలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువచ్చిందని, ప్రజలకు, ప్రజాస్వామిక వాదులతో చర్చించకుండా ఇటీవల న్యాయ చట్టాలు రూపొందిం చిందన్నారు. దేశంలో విద్యా, వైద్యం పేద ప్రజలకు అందడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, పల్లా వెంకటరెడ్డి, పశ్యపద్మా, కలవేణ శంకర్, ఎం. బాలనరసింహా, బి. విజయసారథి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వయనాడు బాధితులకు సీపీఐ తెలం గాణ సమితి నుంచి రూ.5.41లక్షల ఆర్థిక సహాయాన్ని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అందించారు.



మాట్లాడుతున్న ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్, చైర్మన్ కరుణాకర్‌రెడ్డి

ఏకశిల ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం

వరంగల్ మెడికల్, ఆగస్టు 23 : తెలంగాణలో (హైదరాబాద్ మినహా) తొలి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను హనుమకొండలోని ఏకశిల ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్, చైర్మన్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏకశిల హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాయపర్తి గ్రామానికి చెందిన గాదె విజయ్ కుమార్ గత ఏడు సంవత్సరాలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా డయాలసిస్‌పై ఉండగా హాస్పిటల్‌లోని నెఫ్రాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్ కుమార్‌ల సూచన మేరకు డయాలసిస్ టెక్నికల్ మేనేజర్ రమేశ్ ప్రోద్బలంతో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పేషంట్ భార్య ఉమాదేవి కిడ్నీని దానం చేసింది. ఈ క్రమంలో భార్యాభర్తలిద్దరిని వైద్య బృందం సునిశితంగా పరీక్షించి శస్త్ర చికిత్సకు వెళ్లవచ్చని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ శస్త్ర చికిత్సలో ట్రాన్స్‌ప్లాంట్ యూరాలజిస్టు డాక్టర్ ఎస్.జయరాంరెడ్డి, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్, నెఫ్రాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్‌కుమార్, అనస్థిషియా డాక్టర్ వి.రమేశ్‌ల ఆధ్వ ర్యంలో ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం పేషంట్‌తోపాటు కిడ్నీ దాత ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నట్లు వివరిం చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, డాక్టర్లు, వైద్య బృందం, హాస్పిటల్ ఆర్ఎంవో డాక్టర్ వెంకట్‌రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కొడుకు మృతి..

- తట్టుకోలేక ఆగిన సవతితల్లి గుండె
- మహబూబాబాద్‌లో విషాద ఘటన

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 23 : తన కడుపున పుట్టకపోయినా.. కన్నవారితో సమానంగా ఆ కుమారుడిని సాకింది ఆ తల్లి. సవతితల్లి అనే మాటే కానీ పిల్లలను పెంచే విషయంలో ఎక్కడా సొంత తల్లి లేని లోటును కనిపించకుండా పెంచి పోషించింది. అలాంటి ఆ తల్లి అనారోగ్యంతో మృతి చెందిన కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తూ ప్రాణాలొదిలిన విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు శనిగపురంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.

శనిగపురం గ్రామానికి చెందిన మంద వెంకన్న రైల్వే ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వెంకన్న భార్య స్వరూప 30 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటికే వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. భార్య చనిపోవడంతో వెంకన్న పిల్లల ఆలనాపాలన కోసం చిన్న గూడూరు మండలం జయ్యారానికి చెందిన జ్యోతి (50)ని రెండో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత జ్యోతి ఆ ముగ్గురు పిల్లల బాగోగులు చూసుకునేది. ఈ క్రమంలోనే వెంకన్న, జ్యోతికి ఓ కుమారుడు, కుమార్తెకు జన్మించారు. అయినప్పటికి జ్యోతి ఐదుగురు పిల్లలను తారతమ్యం లేకుండా పెంచి పెద్ద చేసింది. మొత్తం ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులకు వివాహాలు చేసింది. ఏడాది క్రితం వెంకన్న కూడా చనిపోవడంతో జ్యోతి ఖమ్మంలోని తన కూతురు వద్ద ఉంటోంది. ఈ క్రమంలో వెంకన్న మొదటి భార్య కుమారుడు రవి (32) శనిగపురంలో ఆటో నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కానీ, ఇటీవల కాలంలో మద్యానికి బానిసైన రవి తరచూ గొడవపడటంతో అతడి భార్య స్వప్న నాలుగు నెలల క్రితం నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలోని తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయిన రవి అనారోగ్యం పాలై గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు ఖమ్మంలో ఉన్న సవతితల్లి జ్యోతికి సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం శనిగపురం చేరుకున్న జ్యోతి రవి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించింది. ఈ క్రమంలోనే గుండెపోటుకు గురై కొడుకు మృతదేహంపైనే అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబసభ్యులు స్థానిక వైద్యుడికి చూపించారు. అయితే అప్పటికే జ్యోతి మృతి చెందినట్టు నిర్ధారించారు. అనంతరం కుటుంబసభ్యులు రవి అంత్యక్రియలను నిర్వహించి.. జ్యోతి మృతదేహాన్ని ఆమె పుట్టినిల్లయిన చిన్న గూడూరు మండలం జయ్యారానికి తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు రవికి భార్య స్వప్న, నాలుగేళ్ల కుమారుడు నవనీత్‌కుమార్ ఉండగా.. నాలుగేళ్ల నవనీత్ కుమార్ తండ్రికి తలకొరివి పెట్టడం చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇక తనకు పుట్టక పోయినా చిన్నప్పటి నుంచి ప్రేమగా పెంచి పోషించిన కుమారుడు ఇలా చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన జ్యోతి అతడి మృతదేహంపై పడి మృతి చెందడం తమను కలిచివేసిందని కుటుంబసభ్యులు, గ్రామస్థులు చెబుతున్నారు.



మంద రవి (ఫైల్)



జ్యోతి (ఫైల్)



రమేష్ అంతిమసంస్కారాలు నిర్వహిస్తున్న చిన్నారి నవనీత్

భూసేకరణే అడ్డు!

5వ పేజీ తరువాయి

కోరింది. అయితే గత ప్రభుత్వం రూ.520కోట్ల నిధులతో పాటు 253 ఎకరాల భూమిని కేటాయించేందుకు ముందుకు వచ్చింది. దీనికి సంబంధించి 2023 ఆగస్టు నెలలో జీవో ఎంఎస్ నెం.36ని జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను ఏఏఐ పరిగణనలోకి తీసుకోకపోవటం, భూసేకరణ, నిధులు విడుదల చేయటంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విమానాశ్రయం పనులు 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అనే చందంగా మారింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మామునూరు ఎయిర్‌పోర్టుపై దృష్టి పెట్టింది. దీంతో రంగంలోకి దిగిన ఏఏఐ అధికారులు మామునూరులో ఉన్న పాత 1.8కి.మీ రన్‌వేను పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో విమనాలు నడిపించేందుకు అనుకూలంగా ఉండేలా ప్రస్తుతం ఉన్న 1.8కి.మీల రన్‌వేను 3.9కి.మీలకు పెంచాలని ఏఏఐ అధికారులు సూచించారు. ఇప్పటికే పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 694ఎకరాల వరకు భూమి ఉంది. కనీసం మరో 306 ఎకరాల భూమిని కేటాయిస్తే పెద్ద విమానాలు నడిపించేలా రన్‌వేను నిర్మించవచ్చునని ఏఏఐ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ స్థాయిలో విమానాలను నడిపించేందుకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నట్లుగా అధికారులు నిర్ధారించినట్లుగా సమాచారం.

భూసేకరణే ప్రధాన అడ్డంకి..

వరంగల్ ఎయిర్‌పోర్టుకు ప్రధానంగా భూసేకరణే అడ్డంకిగా మారుతోంది. నిజాం కాలంలో 1,875ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు కోసం కేటాయించారు. అయితే ప్రస్తుతం ఇందులో నుంచి జవహర్ నవోదయ విద్యాలయానికి 23.20ఎకరాలు, పోలీస్ శిక్షణ కళాశాలకు 59ఎకరాలు, ఏసీపీ కార్యాలయానికి 10ఎకరాలు, వరంగల్ సెంట్రల్ జైలుకు 101ఎకరాలు, ఫోర్త్ బెటాలియన్‌కు 241.24ఎకరాలు, మరో 675 ఎకరాల భూమిని వెటర్నరీ యూనివర్సిటీకి కేటాయించారు. రోడ్డు, ఇతర వాటికి పోగా ప్రస్తుతం 696ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. అయితే ఎయిర్‌పోర్టుకు 1,200ఎకరాల భూమి అవసరం కాగా, కనీసం వెయ్యి ఎకరాల భూమి అయినా ఇవ్వాలని కేంద్ర విమానాయశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇంకా 304ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. జూన్ 29న వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఏఏఐ అధికారులతో ప్రభుత్వం జరిపిన చర్చల మేరకు త్వరగా ఎయిర్‌పోర్టుకు భూమి కేటాయించాలని రెవెన్యూ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో వరంగల్ జిల్లా కలెక్టర్‌తో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగెం మండలంలోని గుంటూరుపల్లి, నక్కలపల్లి, గడపల్లి, మామునూరు గ్రామాల్లో భూసేకరణ కోసం గ్రామసభలు నిర్వహించారు. ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని రైతుల నుంచి 259ఎకరాల వరకు సేకరించాలని నిర్ణయించారు. అయితే ఎయిర్‌పోర్టుకు భూములు ఇచ్చేందుకు రైతులు సానుకూలంగానే ఉన్నారు. కానీ, తమకు భూమికి బదులుగా మరో చోట భూమి కావాలని పట్టుబడుతున్నారు. వెటర్నరీ కాలేజీలో అదనంగా ఉన్న సుమారు 60ఎకరాల భూమిని రైతులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్చలు జరిపింది. అయితే ఆ భూమి సాగుకు అనుకూలంగా లేని చౌడు నేల కావటంతో రైతులు విముఖత చూపుతున్నట్లుగా సమాచారం. ప్రత్యామ్నాయంగా భూమి లేకపోవటంతో నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎకరానికి రూ.80లక్షలు చెల్లించేందుకు రైతులతో అనధికారికంగా చర్చలు జరిపారు. తమ భూములకు ప్రభుత్వం ధర కాకుండా బహిరంగ మార్కెట్‌లో ధరను చెల్లించాలని రైతులు పట్టుబడుతున్నారు. ఎయిర్‌పోర్టు వస్తుండటంతో ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.1.50కోట్ల నుంచి రూ.2కోట్లకు పైగా ధర పలుకుతోందని, ఆ ధరనే తమకు చెల్లించాలని రైతులు పట్టుబడుతున్నారు. దీంతో 259ఎకరాలకు రూ.388.5కోట్ల నుంచి రూ.518కోట్లు నష్టపరిహారం కిందనే చెల్లించాల్సి వస్తుంది. ఇంత పెద్దమొత్తంలో రైతులకు నష్టపరిహారం ఇవ్వడం కుదరదని అధికారులు పేర్కొంటున్నారు. నష్టపరిహారంపై రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం నుంచి రైతులకు చెల్లించే నష్టపరిహారంపై ఎలాంటి స్పష్టత రాకపోవటంతో ఎయిర్‌పోర్టు పనులకు ఆటకం ఎదురవుతోంది. రైతుల నుంచి 259 ఎకరాలతో పాటు వెటర్నరీ కాలేజీకి చెందిన 40 ఎకరాల భూమి కూడా కలుపుకుని సుమారు 299 ఎకరాల భూమిని ఏఏఐకి కేటాయించాలని అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో ఏఏఐ కావాల్సిన సుమారు వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు పూర్తి అవుతుందని భావిస్తున్నారు.

ఎకరాకు రూ.2కోట్ల పరిహారం ఇవ్వాలి

- దండ నరేష్, గుంటూరుపల్లి, సంగెం మండలం, వరంగల్ జిల్లా



ఎయిర్‌పోర్టు కోసం భూములు ఇచ్చేందుకు అభ్యంతరం లేదు. కానీ, ఎయిర్‌పోర్టు కోసం భూములను త్యాగం చేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. బహిరంగ మార్కెట్‌లో ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.2కోట్ల వరకు ధరలు ఉన్నాయి. అవే ధరలను భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించాలి. అలాగే రైతు కుటుంబంలోని అర్హతలను బట్టి ఎయిర్‌పోర్టు ఉద్యోగావకాశాలు కల్పించాలి.

ఆర్థిక దృక్పథం పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 23: ప్రణాళిక శాఖ రూపొందించిన తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం-2024 పుస్తకాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మ శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఆర్థిక, సామాజిక అభివృద్ధి, కీలక ఆర్థిక సూచికలను క్రోడీకరించి ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల్లో తెలంగాణ ఎలా పురోగమిస్తుందో ఈ పుస్తకం తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీపీవో శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ

ఎల్‌ఆర్‌ఎస్‌కు 2020లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ ప్రకియ చేపట్టనున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల విచారణ ప్రక్రియపై రెవెన్యూ, మునిసిపల్, డీపీవో, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌కు 8,310 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వాటిపై విచారణకు 56 బృందాలను ఏర్పాటు చేశామనానరు. విచారణ ప్రక్రియను నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

మంగపేట, ఆగస్టు 23: మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిమ్మంపేటలో ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించడంలో భాగంగా వైద్యాధికారి వైశాలి ఆధ్వర్యంలో ఇంటింటా మాస్ ఫీవర్ సర్వేను చేపట్టారు. 32 మంది ఆశా కార్యకర్తలు, 10 మంది ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పోస్టాఫీస్, వాటర్ ట్యాంక్ ఏరియాలలో వైద్య శిబిరాలు నిర్వహించి, జ్వరంతో బాధ పడుతున్న వారికి రక్త పరీక్షలు చేశారు. అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా బీపీ, షుగర్ బాధితులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణతో పాటు హెల్త్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

చిట్యాల, ఆగస్టు 23: మండల కేంద్రంలో స్థానిక రెండో ఎస్సై షాఖాన్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. సరైన పత్రాలు లేని వాహనదారుల జరిమానాలు విధించారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ రవి, కానిస్టేబుళ్ల లాల్‌సింగ్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి బెంచీలు

చిట్యాల, ఆగస్టు 23: మండలంలోని చల్లగరిగలోని అంగన్‌వాడీ కేంద్రానికి అదే గ్రామానికి చెందిన కర్రె అమర్నాథ్‌రెడ్డి. ప్రేమ్‌నాథ్‌రెడ్డి బెంచీలను శుక్రవారం అందజేశారు. వారి తండ్రి నరసింహరెడ్డి, నానమ్మ లక్ష్మి జ్ఞాపకార్థం విద్యార్థులకు అవసరమైన డెస్క్ బెంచీలను వితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, మాజీ చైర్మన్ అశోక్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద, టీచర్లు తిరుపతమ్మ, కరుణ, శారద, కనకలక్ష్మి, కవిత, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలే కీలకం

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



జబ్బార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్ ఆగస్టు 23: కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలే కీలకమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా వారిని, వారి కుటుంబాలకు అండగా ఉంటానన్నారు. సీతక్క వ్యక్తిగత సహాయకుడు ములుగు మండలంలోని జగ్గయ్యపేటకు చెందిన కొట్టెం వెంకటనారాయణ (జబ్బార్) గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శుక్రవారం ఆయన ప్రథమ వర్ధంతి జరిగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సీతక్క నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ జబ్బార్ మరణం కాంగ్రెస్‌కు తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

వయానాడ్ వరద బాధితులకు అమ్మ ఫౌండేషన్ చేయూత



సీతక్కకు చెక్కు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

వెంకటాపురం(నూగూరు): కేరళ రాష్ట్రం లోని వయనాడ్ వరద బాధితులకు అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు పీర్ల కృష్ణబాబు రూ.50వేల చెక్కును రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్కకు శుక్ర వారం అందజేశారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కష్టా ల్లో ఉన్నవారికి సహాయం చేయడం సంతోషకరమని అన్నారు. మరి కొందరు దాతలు ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయం

ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 23: గిరిజనులకు సంక్షేమ ఫలాలను సకాలంలో అందించి, వారికి అన్ని విధాలా అండగా ఉండటమే ధ్యేయమని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. మండలంలో ఆయన శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. శివాపురంలోని పరిశ్రమలో గిరిజనులు ఉత్పత్తి చేస్తున్న సబ్బుల తయారీని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ సెక్టోరియల్ అధికారులతో సామావేశమయ్యారు. ఈఎస్‌ఎస్, ఎంఎస్‌ఎంఈ, గిరి వికాసం, రూరల్ ట్రాన్స్‌పోర్టేషన్ తదితర పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైకార్ ద్వారా గిరిజనుల ఆర్థిక పరిపుష్టికి కృషి చేస్తామన్నారు. ట్రైకార్ రుణాలను గిరిజనులకు సకాలంలో అందచేస్తామన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలే కాకుండా గిరిజనులు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వీలున్న పథకాలకూ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ట్రైకార్ ద్వారా అమలవుతున్న పథకాలపై గిరిజన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ట్రైకార్ జనరల్ మేనేజర్ శంకర్రావు, లక్ష్మీప్రసాద్, డీడీ పోచం, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఎస్‌వో రాజుకుమార్, ఏటీడీవో దేశీరాం, జేడీఎం కొండల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

మొగుళ్లపల్లి, ఆగస్టు 23: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని రంగాపురం గ్రామంలో మొగుళ్లపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన శుక్రవారం జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. దాతల సహకారంతో గ్రామంలో మొత్తం 50 సీసీ కెమె రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఇదే గ్రామం మాదిరిగా మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు సమ న్వయంతో, స్వచ్ఛందంగా నిధులు సమకూర్చుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక సౌక ర్యాలు కల్పించి అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచే స్తోందన్నారు. ఎస్పీ కిరణ్‌ఖరే మాట్లాడుతూ రంగాపురం గ్రామం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో నిత్యం ఉంటుందని అన్నారు. ఎలాంటి నేరాలు జరిగినా ఇవి తక్షణమే ఛేదిస్తాయన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిం చినట్లయితే పోలీ సులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణరావును గ్రామస్థులు శాలువాలతో సన్మానించారు. వ్యాపారవేత్త బలుగూరి సంతోష్ రావు, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, చిట్యాల సీఐ మల్లేష్, మొగుళ్లపల్లి, చిట్యాల, టేకుమట్ల, రేగొండ, గణపురం ఎస్సైలు అశోక్, శ్రావణ్‌కుమార్, ప్రసాద్, సందీప్, అశోక్‌తోపాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు పోలినేని లింగారావు, బలుగూరి తిరుపతిరావు, సూరినేని రవీందర్‌రావు, రాజేశ్వర్‌రావు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

త్వరలో ఉద్యమకారుల చైతన్య యాత్ర

మంగపేట, ఆగస్టు 23: తెలంగాణ మలి దశ ఉద్యమకారుల చైతన్య యాత్ర మండలంలోని రాజుపేట నుంచి ములుగు వరకు త్వరలో చేపడుతున్నట్టు తెలంగాణ ఉద్యకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట ఏడుకొండల్ తెలిపారు. మంగపేటలోని శ్రీమద్వీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా తెలంగాణ ఉద్యమకారులకు ఆదరణ లభించడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు గాదే శ్రీనివాసాచారి, చిలుకమర్రి రాజేందర్, చిన్నపెల్లి వెంకన్న, గూడ వాసుదేవమూర్తి, గుడిసేవ నాగేశ్వర్‌రావు, యాదేండ్ల రాజయ్య యాదవ్, ఈదునూరి రవీందర్, ఎస్కే. అఫ్జల్, లోడంగి లింగయ్య, కొమరగిరి కేశవరావు, కొండగొర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తాం

ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 23 : అలీం కో స్వచ్ఛంద సంస్థ సహకారంతో అర్హులైన దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను అందిస్తామని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను అందించేందుకు శుక్రవారం దరఖాస్తులు స్వీకరించారు. సుమారు వెయ్యి మంది దివ్యాంగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ దివ్యాం గుల్లో విశేష ప్రతిభపాటవాలు ఉంటాయని, వారికి సరైన సమయంలో చేయూతనందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. అర్హులైన దివ్యాంగులకు సకాలంలో సదరం సర్టిఫికెట్స్‌ను ఇంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. దివ్యాంగులకు సహాయ, సహకారాలు అందిస్తున్న అలీం కో సంస్థకు అభినందనలు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన మాట్లాడుతూ ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటా పురం(నూగూరు), వాజేడు మండలాల్లోని దివ్యాంగులకు ఉపకరణాలను అందించేందుకు శిబిరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. 40 శాతం, 80శాతం వైకల్యంపై బడిన వారిని ప్రత్యేకంగా గుర్తిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ప్రేమలత, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఆలింకో సంస్థ ప్రతినిధి ఆశీష్, దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూజారి మాణిక్యం, జిల్లా అధ్యక్షుడు బాస్కర్, బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఎంఈవోను నియమించాలి

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 23: మండలంలో రెగ్యులర్ ఎంఈవోను నియమించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రేగా గణేష్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సంఘం ముఖ్య కార్యకర్తల శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ ఎంఈవో లేకపోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ లోపించి విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని అన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు సమయానికి రావడం లేదని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ ఎంఈవోను నియమించాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు మేకల మహేష్, పూనెం ప్రతాప్, అట్టం మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

వాజేడు, ఆగస్టు 23: మండల కేంద్రంలో వాజేడు పోలీసులు డ్రగ్స్ నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై హరీశ్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరూ పోరాడదామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదర్థాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నంబర్‌పై 8712670120 కాల్ చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

మొగుళ్లపల్లి, ఆగస్టు 23: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని ఇస్సిపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. బాధిత రైతు యారా రాజిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన పత్తిచేనులో గుంటుక కొడుతుండగా పైన వేలాడుతున్న విద్యుత్‌తీగ ప్రమాదవశాత్తు తగిలి దుక్కిటెద్దు అక్కడికక్కడే మృతిచెందిందని అన్నారు. విద్యుత్ తీగలు కిందికి వేలాడడంతోనే రూ.75వేల విలువచేసే దుక్కిటెద్దు మృతిచెందిందని పేర్కొన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు రాజిరెడ్డి కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

కాటారం, ఆగస్టు 23: మండలంలోని కాటారం, జాదరావుపేట, ఆదివారంపేట తదితర గ్రామాల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, బ్లూ కోల్ట్ కానిస్టేబుల్స్ రఘు, సాంబశివరావు రైతులు, కూలీలు, వాహనాల్లో వెళ్లే ప్రయాణికులకు ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న మోసాలు, డబ్బుల విషయమై కొందరు చేసే ఫేక్ ఫోన్ కాల్స్ మెసేజ్‌పై అవగాహన కల్పించారు. ఆర్థిక మోసాలు జరిగితే టోల్ ఫ్రీ న ంబర్ 1930 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

బోనమెత్తిన శివసత్తులు



బోనాలతో శివసత్తులు

ములుగు రూరల్ ఆగస్టు 23: శ్రావణ శుక్రవారం సందర్భంగా శివసత్తులు బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని జక్కుల భవాని ఇంటి వద్ద ఈ వేడుకలు జరిగాయి. ఉదయం నుంచి ఉపవాసదీక్ష చేస్తూ బోనాలను అలంకరించారు. డప్పు చప్పుళ్లతో జిల్లా పురవీధుల మీదుగా బోనం ఎత్తుకుని నృత్యాలు చేస్తూ పోచమ్మగుడి వరకు వెళ్లారు. మూడో శ్రావణ శుక్రవారం కావడంతో వరలక్ష్మీదేవికి అత్యంత ఇష్టమైన రోజుగా భావించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామ పొలిమేరల్లోకి దుష్ట శక్తులు రాకుండా గ్రామదేవత (బొడ్రాయి) వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ తల్లికి పసుపు, కుంకుమ, చీర సారెలతో పాటు కల్లు శాకం, జంతు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

గోవిందరావుపేట, ఆగస్టు 23: తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మేడుదుల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ త్వరలో ములుగు నుంచి మంగపేట వరకు నిర్వహించే చైతన్యయాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు పెండెం హేమాద్రి, కడారి తిరుపతి, దర్శనాల సంజీవ, బత్తుల రాణి, రమేష్, అకినపల్లి రమేష్, ధర్మయ్య, రేండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ములుగులో 'బాలగోకులం'

ములుగు రూరల్ ఆగస్టు 23: ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బాలగోకులం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ధర్మజాగరణ సమితి కన్వీనర్ గండ్రకోట కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణ జన్మష్టమిని పురస్కరించుకొని మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ముఖ్య అతిథిగా ఎస్పీ శబరీశ్ హాజరవుతారని పేర్కొన్నారు. ములుగు, వెంకటాపూర్ మండలాల నుంచి సుమారు 2,500 మంది చిన్నారులు గోపిక, చిన్ని కృష్ణుని వేషధారణలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీఎల్‌వోలతో తహసీల్దార్ సమావేశం

మహాముత్తారం, ఆగస్టు23: పంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితా సవరణపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో తహసీల్దార్ శ్రీనివాస్ శుక్రవారం సమావేశమయ్యారు. బీఎల్‌వోలుగా వ్యవరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు తహసీల్దార్‌తో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమతో పని చేయిస్తున్నారని అన్నారు. బీఎల్‌వోలకు కేటాయించిన విధులనే తాము నిర్వహిస్తామని తెలిపారు. మంథని అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రెయినర్ గీట్ల భరత్‌రెడ్డి బీఎల్‌వోలకు ఓటర్ల ఇంటింటి సర్వేపై అవగాహన కల్పించారు. డీటీ సందీప్, ఆర్‌ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాటారం..

కాటారం: :మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని బీఎల్‌వోలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. మాస్టర్ ట్రైనర్ నాగరాజు వివిధ అంశాలపై శిక్షణనిచ్చారు. బీఎల్‌వోలు వారి పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి ఓటర్ జాబితాల్లో సవరణలు చేయాలన్నారు. ఓటు హక్కులో తప్పులుంటే ఫారం-8, చనిపోయిన ఓటర్‌కు సంబంధించి ఫారం-7, 2025 జనవరి 1వరకు 18సంవత్సరాలు నిండే వారిని గుర్తించి నూతన ఓటరు నమోదు కోసం ఫారం-6లో నమోదు చేయాలన్నారు. డీటీ రాంమోహన్ మాట్లాడుతూ బీఎల్‌వో యాప్‌పై అవగాహన కల్గి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రాంమోహన్, ఆర్‌ఐ, సూపర్ వైజర్లు, ఎస్‌ఏలు, జేఏలు తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



పూల్‌సింగ్ (ఫైల్)

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 23: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చికెన్‌పల్లికి చెందిన గుగులోతు పూల్‌సింగ్ (56) అదే గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్యతో తలెత్తిన కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూ చూడని సమయంలో శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి గుగులోతు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. పూల్‌సింగ్‌ని తన భార్యతోపాటు కుమారుడు, కుమార్తెలు, అల్లుళ్లు ఆస్తి విషయంలో తలెత్తిన వివాదాల కారణంగా హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరి స్తున్నారని బంధువులు ఆరోపిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కాటారం, ఆగస్టు 23: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోగల సబ్ సెంటర్ల వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం చింతకాని, గారెపల్లి, కాటారం, గంగారంతో పాటు పలు గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాలు చేపట్టారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఇంటింటా తిరుగుతూ ఫీవర్ సర్వే నిర్వహించారు. జిల్లా ఎపిడమిక్ టీం సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించింది. సబ్ యూనిట్ ఆఫీసర్లు రమేష్‌కుమార్, పరమేశ్వర్ దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు వివరించింది. గంగారం మోడల్ స్కూల్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సుమన్, హెచ్‌ఏ సమ్మయ్య, కార్యదర్శులు సఫీర్‌ఖాన్, నాగరాజు, శేఖర్, ఏఎన్‌ఎంలు మనోరమ, లక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి (ఫైల్)

మేడారం, ఆగస్టు 23 : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు నెలలుగా మేడారంలో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి గురువారం ఉదయం వీవీఐపీ పార్కింగ్ రోడ్డుపై అస్వస్థతకు గురై కింద పడి ఉండడంతో గమనించిన గ్రామస్థుడు కురుసం రవి పోలీసులకు సమాచారం అందించాడు. స్పందించిన ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అతడిని మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే ఆ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. గ్రామ కార్యదర్శి సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు. ఈ వ్యక్తి వివరాలు తెలిసినవారు తాడ్వాయి పోలీసులకు అందించాలని కోరారు.

మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు చేయాలి

అధికారులతో ములుగు కలెక్టర్ దివాకర



మెడికల్ కళాశాల ఆవరణలో అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

ములుగు, ఆగస్టు 23: ములుగు జిల్లా కేంద్రంలో చేపడుతున్న సమీకృత కలెక్టరేట్, మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సమీకృత కలెక్టరేట్, మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి పరిశీలించారు. ముందుగా మెడికల్ కళాశాలలో తరగతిగదులు, లెక్చరర్స్‌హాల్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్‌రూం, లైబ్రరీ, ల్యాబ్, హాస్టల్, మెస్, మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో జరుగుతున్న పనులను సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, అవసరమైతే అదనంగా వర్కర్‌లను నియమించి షిఫ్టులవారీగా పనులు చేయించాలన్నారు. పదిరోజుల్లో మెడికల్ కళాశాల పనులు పూర్తి చేయాలని సూచించారు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్ణీతకాలంలో నాణ్యతప్రమాణాలు లోపించకుండా డిసెంబరులోపు పూర్తి చేసి అధికారులకు అందించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ముగుస్తున్నందున వర్కర్లను పెంచి బ్రిక్ వర్క్, ప్లాస్టింగ్, స్లైప్స్, తదితర పనులను పూర్తి చేయాలని, మూడుసార్లు వాటర్ క్యూరింగ్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్, డీఈ రాజశేఖర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్, తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తాడ్వాయి, ఆగస్టు 23: మండలంలోని ప్రజలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై), ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా జిల్లా కోఆర్డినేటర్ స్వప్న అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో మండల కోఆర్డినేటర్ బండారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ స్వప్న మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో ఏడాదికి రూ.20లు చెల్లిస్తే అనుకోని ప్రమాదంలో మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.2 లక్షల బీమా డబ్బులు వస్తాయని అన్నారు. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకంలో ఏడాదికి రూ.436లు కట్టినట్లయితే జీవితబీమా లభిస్తుందని అన్నారు. అదేవిధంగా ఎవరైనా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా కుట్టుమిషన్, మగ్గంవర్క్, కంప్యూటర్ శిక్షణ తీసుకోవాలనుకునేవారు తమను సంప్రదించాలని అన్నారు. ఈ సదస్సులో మాజీ సర్పంచ్ మంకిడి నర్సింగరావు, సెర్ప్ సీసీ సుజాత, ఆర్‌బీఐ ప్రాజెక్టు మండల కోఆర్డినేటర్లు భాస్కర్, అనూష, పోస్టుమెన్ శ్రీవాణి, గోవిందరావుపేట మండల కోఆర్డినేటర్ చందు, మహిళా సంఘాల లీడర్లు పులి భాగ్య, శ్రీదేవి, వెంకటేశ్ పాల్గొన్నారు.

కన్నాయిగూడెం ఏవోగా మహేష్

కన్నాయిగూడెం, ఆగస్టు 23: వ్యవసాయ శాఖ మండల అధికారిగా ముంజ మహేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఏవోగా విధులు నిర్వర్తించిన వేణుగోపాల్ బదిలీ కావడంతో భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో పని చేస్తున్న మహేష్ బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఏవో మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ చేశారు.

జిల్లా ఆస్పత్రి రోడ్డు చీకటిమయం



భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 23: భూపాలపల్లి మంజూర్‌నగర్‌లోని జిల్లా జనరల్ ఆస్పత్రి ప్రధాన రహదారి చీకట్లో మగ్గుతోంది. రాత్రి వేళల్లో డ్యూటీలకు వచ్చే ఆస్పత్రి సిబ్బంది, ముగించుకొని వెళ్లే సిబ్బంది బిక్కుబిక్కుమంటు వెళ్లాల్సి వస్తోంది. రాత్రుళ్ల వచ్చే రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఈ దారిలో సీసీ కెమరాలను కూడా ఏర్పాటు చేయలేదు. అధికారులు వెంటనే స్పందించి ఆస్పత్రికి వెళ్లే దారిలో లైటింగ్‌ను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని వైద్యసిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.